తమాషా దొంగలు

ఏ. వీ. మోహన్రావ్

బల్లపైనున్న ఇంటర్ కాన్ మ్రోగింది.

చూస్తున్న ఫైలు ప్రక్కకు నెట్టి, ఎడం చెయ్యి ముందుకు చాచి రిసీవరు అందుకొని "యస్!" అన్నాను.

"మిమ్మల్ని చూడాలని ఒకతను వచ్చాడు. బిజీగా వున్నారనీ, అడ్రసిచ్చి వెళ్తే, అపాయింట్ మెంట్ ఫిక్స్ చేసి, ఫోన్ ద్వారా తెలియపరుస్తానని చెప్పాను. అలా వీల్లేదంటూ మొండిగా కూర్చున్నాడు. ఏం చెయ్యాలో చెప్పండి!" అడిగింది నా సెక్రెటరీ వనజ.

అనకూడదుగానీ వనజ వనలక్ష్మిలా, వసంతశోభంతా నింపుకుని, నిండైన యవ్వనపు టందంతో, ఎదుటవాళ్ళను కవ్విస్తూ, కసెక్కిస్తూ వుంటుంది.

"ఏం పని చెప్పాడా?" అడిగాను.

"లేదు! పర్సనల్ అంటున్నాడు" అందామె.

"పేరు మొదలైన వివరాలు కనుక్కున్నావా?"

"ఆc! ప్రకాష్ అట. 'తృప్తి' సూపర్ బజార్‌లో పని చేస్తున్నాడట."

"ఆల్ రైట్!" సెండ్ హిమ్ ఇన్!" అని ఫోన్ క్రేడిల్ పైన పడేశాను.

అలాంటి పేరు నేనింతకుముందు విన్నట్లు లేదు. కానీ 'తృప్తి' సూపర్‌బజార్ గురించి మాత్రం విన్నాను. అన్ని రకాల వస్తువులూ సరసమైన ధరలకు దొరికే ఆరంతస్తుల మార్కెట్ అది.

అక్కడ పనిచేసే ప్రకాష్ నన్ను కలుసుకోవాలని ఎందుకొచ్చి వుంటాడాని ఆలోచిస్తూ కూర్చున్నాను.

ఎదురుగా వున్న ఫ్లష్‌డోర్ నెట్టుకొని ఒక ఆకారం లోనికొచ్చింది. పాతిక సంవత్సరాలుంటాయి ఆ శాల్తీకి అనుకున్నాను. హిప్పీలా జుట్టు పెంచి వున్నాడు. ఎర్రటి సిల్కు షర్టు నల్లటి పాంటులో టక్ చేసుకొని, వెడల్పాటి బెల్టు పెట్టుకొని వున్నాడు. బొద్దుగా పెరిగిన మీసాలు పిల్లిగడ్డంలో కలసిపోయాయి. కళ్ళను దాచిపెడుతూ, పెట్టుకున్నాడు నల్లటి కళ్ళద్దాలు.

"నా పేరు ప్రకాష్! రావచ్చా!" అడిగాడు గుమ్మంవద్ద నిలుచునే.

"రండి! మీ కోసం వెయిట్ చేస్తున్నాను" అన్నాను నేను.

అతను వచ్చి నా కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

"'భాజా' పత్రికలో మీరు రాస్తున్న విషయాలు జనాన్ని, ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాయి. సంఘంలో పేరుకున్న అవినీతినీ, లంచగొండితనాన్ని, ఆశ్రిత పక్షపాతాన్ని, దానివల్ల అధికారులు పొందుతున్న లాభాల్ని చాలా వివరంగా రాస్తున్నారు. మీ ఖలేజాకు నా జోహారులు!" అన్నాడతను.

అలాంటి పొగడ్తలు నాకు కొత్తకాదు.

మూడు మాసాల క్రితం, మద్రాసు మహానగరంలోనే కాదు, అఖిల భారతదేశంలో, పెద్ద పత్రికల అధిపతి, జలాల్, ప్రత్యేకంగా నన్ను పిలిపించి, ఎడిటరుగా నియమించి ప్రారంభించిన పత్రిక 'భాజా'. దాన్ని నడపడంలోని ఉద్దేశ్యం క్రుళ్ళి కంపుకొడుతున్న సమాజాన్ని ఆ మూలాగ్రం కడిగి, జాతీయ జీవనాన్ని పవిత్రమైన మార్గాల్లో నడిపించేందుకు అవసరమైన ప్రజాభిప్రాయాల్ని కూడగట్టడం. అందులో నేను రాసిన ప్రతివిషయానికీ ప్రజలనుండి మద్దతు లభిస్తూనే వుంది.

"నన్ను పొగడడానికని, మీ పనులు మానుకుని, ఇంత దూరం పనిగట్టుకుని వచ్చారన్నమాట!" అన్నాను.

"కాదు! మీతో మరో ముఖ్యమైన విషయం ప్రస్తావించాలని వచ్చాను!" అన్నాడు ప్రకాష్.

"ఏమిటది?"

"మీరుంటున్న బంగళాకు మా సూపర్ బజార్ చాలా దగ్గరలో వుంది!" అన్నాడు అతను.

"తెలుసు!" ఆ విషయం నాకెందుకు చెప్తున్నాడో అర్థంగాక అన్నాను.

"ఆ ప్రాంతాల నివసించే చాలామంది ధనవంతులు

మా వద్దనే వచ్చి షాపింగ్ చేస్తుంటారు. వాళ్ళల్లో మీ శ్రీమతి కూడా వుంది'' అన్నాడు.

''ఐ. సీ. అవన్నీ ఆమె చూసుకుంటుంది. నిజంగా నేనాట్టే ఇంటి విషయాలు పట్టించుకోను!'' అన్నాను.

''మా సూపర్‌బజార్‌లో అమ్మకాలు బాగున్నా ప్రతి సంవత్సరం నష్టం వస్తూంది. ఆ నష్టం రావడానికి ముఖ్యమైన కారణం చాలా వస్తువులు దొంగిలించబడటమేనని ఈ మధ్యనే తెలుసుకున్నాం. కొంత డబ్బు ఖర్చుపెట్టి, క్లోజ్‌డ్ సర్క్యూట్ టి. వీ. ఏర్పాటు చేశారు యజమానులు. నేను దానికి ఫోటోలు తీసే కెమెరాను తగిలించాను'' అన్నాడు ప్రకాష్.

వీటన్నింటి గురించి మా పత్రికలో ఏదన్నా ఆర్టికల్ రాయమంటాడేమోనని, అనుకున్నాను.

''దాంతో తీసిన కొన్ని ఫోటోలు తెచ్చాను. చూడండి!'' అంటూ ఒక పెద్ద కవరు నా ముందుకు తోశాడు.

నేను ఫ్లాప్ తీసి, లోనున్న ఫోటోల్ని వెలుపలికి లాగి ఒక్కొక్కటే చూడసాగాను. నా దృష్టి ఉన్నట్టుండి ఒక ఫోటోపైన ఆగిపోయింది. అందులో వున్నది ఎవ్వరో కాదు. నా భార్య జూలీ. సెన్సోర్ దువ్వెనతీసి దొంగతనంగా హాండ్‌బ్యాగ్‌లో పెట్టుకొంటూ వుండగా తీసిన ఫోటో అది. ఆమె చూపులు చూస్తేనే తెలుస్తుంది దొంగతనం చేస్తున్నట్లు.

ఇంకొన్ని ఫోటోలు చూశాను. జూలీ వున్న స్నాప్స్ మరో రెండు దొరికాయి. నాకు మతిపోయినట్లయింది.

''మీరు కంగారుపడకండి! మీ భార్యతో పాటు ఇంకొంతమంది అందమైన ధనవంతుల భార్యలు కూడా వున్నారు'' అన్నాడతను.

ఆ విషయం అతను చెప్పకుండానే నా కర్థమయింది ఆ ఫోటోలు చూస్తుంటే. మా బంగళాకు ప్రక్కనే వున్న రామారావుగారి భార్య రజని, వీధి చివరి పచ్చ మేడలోని కపూర్ గారి భార్య షీలా, ఇద్దరినీ గుర్తుపట్టగలిగాను.

ఫోటోలన్నీ బొత్తిగాపెట్టి అతని ముందుకు తోశాను.

"చూశారుగా? ఏమంటారు?" అన్నాడు ప్రకాష్.

"నాచేత ఏమనిపించాలని తెచ్చారివి?" అడిగాను నేను.

"ఎందరో గొప్పవాళ్ళ అవినీతి నేరాలను, అసభ్యపు జీవితాలను, అందమైన కథల్లా తీర్చిదిద్ది, ప్రచురిస్తున్నారు మీ పత్రికల్లో. మీకున్న పేరూ ప్రతిష్ఠా నాకు తెలుసు. మీ శ్రీమతి ఫోటో మీరు చూసిన ఫోజులో ఏదైనా పేపరులో పడితే ఎలా వుంటుందంటారు?" అడిగాడు ప్రకాష్.

అతను నన్ను ఆ ఫోటో సాకుగా బ్లాక్ మెయిల్ చెయ్యాలని వచ్చాడని వూహించాను.

"వాటికి ప్రచారం లేకుండా చూసే పూచీ నాది. దానికి కొంత ఖర్చవుతుంది. పెట్టుకుంటారా?" సూటిగా అడిగాడు ప్రకాష్.

"ఏమాత్రం?" అడిగాను.

"ఎంతోనా? పదివేలు! చాలు! ఆ ఫోటో పాజిటివ్ లతో సహా, నెగటివ్ లు కూడా ఇచ్చేస్తాను. మీ శ్రీమతి మళ్ళీ ఇటువంటి పనులు చెయ్యకుండా చూసుకోండి. అనవసరమైన ఖర్చులు... ఇలాంటివి... ముందు ముందు తగలకుండా వుంటాయి" అన్నాడు ప్రకాష్.

"అంత మొత్తం నా దగ్గర లేదు. ప్రస్తుతంలో సమకూడదు కూడా! కొంత టైం కావాలి!" అన్నాను.

"మనసుండాలి! మార్గం దొరుకుతుంది!"

"నా పరిస్థితి నాకన్నా నీ కెక్కువ తెలుసా?"

"తెలుసు! మీ ఆవిడ ఎడంచేతికి ఆరుగాజులున్నాయి. మెళ్ళో రవ్వల నెక్లెసుంది. చెవులకు రవ్వల దుద్దులున్నాయి. అవన్నీ అమ్మితే నే నడిగినదానికన్నా ఎక్కువే వస్తుంది!" అన్నాడు ప్రకాష్.

వాడిమీద నాకు కోపం ముంచుకొచ్చింది. ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కొన్న ఆ నగలకు ఇంకా సగానికిపైనే డబ్బు కట్టాలన్న విషయం నాకు తెలుసుగానీ వాడికి తెలీదుగా! డబ్బు ఇవ్వనని మొరాయిస్తే, నా పరువు బజారున వేసేస్తాడు. ఆ తర్వాత పదిమందిలో తలెత్తుకొని తిరిగే వీలు కూడా వుండదు.

"నిన్నెక్కడ కలుసుకోవాలి!" అడిగాను.

జేబులోంచి ఒక కార్డు తీసి పడేశాడు టేబుల్‌పైన. దాన్ని అక్కడే వుంచి చూశాను.

"ఇవాళొస్తారా?" అడిగాడు ఆశగా.

"రాను! రేపు!!" అన్నాను.

"రాత్రి పది తర్వాత రండి. రివాల్వర్లు, కత్తులు, లాంటివి తేకండి. అవి నా దగ్గరా వున్నాయి. నలుగురు రౌడీలను వెంటపెట్టుకొచ్చి చంపుదామనుకున్నారంటే, నేను చచ్చాక కూడా మీ పరువు బజారుకెక్కే ఏర్పాట్లు చేసి మరీ వుంచుతాను" అన్నాడు.

"అలాంటిదేమీ వుండదు!" అన్నాను.

"మంచిది! వస్తాను! రేపురాత్రికి పదిగంటలకు వొంటరిగా పదివేలు పట్టుకురండి! ఫోటోలు నెగటివ్‌లు పట్టుకుపోండి!" అంటూ లేచి వెళ్ళిపోయాడు గదిలోంచి.

నాకు జూలీపైన కోపం ముంచుకొచ్చింది.

ఇంటర్ కామ్ బజర్ నొక్కాను.

"హల్లో!" అంది నా సెక్రెటరీ వనజ.

"నేను అర్జెంటు పనిమీద వెళ్తున్నాను. ఎవరైనా వచ్చి అడిగితే ఎక్కడికి వెళ్ళిందీ తెలీదని చెప్పు!" అన్నాను.

"అలాగే! ఒకవేళ బాస్ మిమ్మల్ని చూడాలంటే!" తన అనుమానం వ్యక్తం చేసింది.

"ఆయనకూ అదేమాట చెప్పు!" అన్నాను.

"ఓ. కే!" అంది వనజ.

ఫోన్ పెట్టేశాను.

హాండ్ కేస్ సర్దుకున్నాను. ప్రక్కనున్న అల్మైరాలో హాంగర్ కు తగిలించిన కోటుతీసి కుడిచేతిపైన వేసుకొని వెలుపలికొచ్చాను.

ఎలివేటర్ ను వదలేసి, మెట్లమీదుగా దిగి క్రింది కొచ్చాను.

2

కారు పోర్టికోలో ఆపి, డోర్ తెరచుకుని దిగాను.

హాల్లోకి అడుగుపెట్టాను.

జూలీ డబుల్ సోఫాలో కూర్చునుంది. ఆమెకెదురుగా వున్న సోఫాల్లో ముగ్గురు ఆడవాళ్ళున్నారు. అందరి చేతుల్లోనూ వున్న గ్లాసుల్లోంచి బిస్కెట్ బ్రాందీ పసుపు పచ్చగా మెరుస్తూంది.

"మీ హబ్బీ!" అందొకామె జూలీతో.

"దట్స్ ఓకే! లెటజ్ కారి ఆన్;" అంటూంది జూలీ.

మెల్లెక్కుతూ "జూలీ!" అని పిలిచాను.

"వాట్ డియర్!" అడిగింది త్రాగుతూనే.

"ఓమారు పైకి రా!" అన్నాను.

అందరూ గొల్లున నవ్వారు ఆ మాటల్లో ఏమర్థం స్ఫురించిందోనని. నాకు ఏడుపొస్తూంది జరిగిన సంఘటన తలచుకొని. వెనక్కి తిరిగిచూడకుండా పైకి వెళ్ళిపోయాను.

కోటు తీసి ప్రక్కన పెట్టాను.

పాంట్ కున్న లెదర్ బెల్ట్ లాగి సోఫాపైన వేశాను.

జూలీ పైకొచ్చింది.

నాకోసం గ్లాసునిండా పోసుకొచ్చింది బ్రాందీ.

"తీసుకో!" అంది గోముగా, మత్తెక్కిన కళ్ళతో నాకేసి చూస్తూ.

"వద్దు! నువ్వలా కూర్చో! అర్జంటుగా మాట్లాడాలి!" అన్నాను.

"ఇప్పుడా! సారీ! క్రింద నా ఫ్రెండ్సంతా వున్నారు. నా కంపెనీ లేకుండా త్రాగలేరు. వాళ్ళను పంపాక వస్తాను. తీరగ్గా తెల్లవారిందాకా మాట్లాడుకుందాం!" అంది జూలీ.

నాకు కోపం ఎక్కువయింది.

"నోరు మూసుకొని కూర్చో!" అన్నాను కర్కశంగా.

నా గొంతులోని కాఠిన్యానికి అదిరిపడినట్లు బిత్తర చూపులు చూసింది జూలీ. ఆ తర్వాత కూర్చుంది.

"నీకిదేం రోగం?" అడిగాను ప్రకాష్ దగ్గరనుండి అతను చూడకుండా తస్కరించి తెచ్చిన ఫోటో ఆమె ముందుకు చూస్తూ.

దానికేసి చూసి భయపడిపోయింది. కళ్ళలోకి ఎక్కి తైతక్కలాడిన మత్తుమాయమై, దాని స్థానే భయం చోటు చేసుకోవడం గమనించాను.

"మీ కక్కడిదిది?" అడిగింది జూలీ.

"నా ప్రశ్నకది జవాబు కాదు!" అన్నాను.

"ఆ రాస్కెల్ నెగటివ్‌లు, పాజిటివ్‌లు మాత్రం ఇస్తున్నానన్నాడు!" అంది జూలీ.

"ఎవరు? ప్రకాష్ సంగతేనా నువ్వు చెప్పేది?" అడిగాను.

"కాదు రాజేష్!" అంది.

"అవి ఇచ్చినందుకు ఎంత వసూలు చేశాడు నీదగ్గర!" అడిగాను.

"వసూలా? అలాంటిదేమీ లేదు!"

"నాన్సెన్స్! నాకు చెప్పే కథలు నిజం చెప్పు" అరచాను మేడ పైకప్పు దద్దరిల్లేలా.

"ఎంతోనా! రెండొందలిచ్చాను" అంది జూలీ.

అవి నమ్మదగ్గ మాటలు కాదని నాకే కాదు, ఆమె కూడా తెలుసు. నిజం కక్కించాలన్న కక్ష నాలో వటవృక్షంలా పెరిగింది.

"నాదగ్గరకొచ్చిన మనిషి పదివేలు తెమ్మన్నాడు. లేకుంటే పేపర్లలో వేయించి మన బ్రతుకులు అల్లరిపెడతా నన్నాడు. నన్నేం చెయ్యమంటావ్?" అడిగాను నన్ను నేను తమాయించుకొని.

"డబ్బు తీర్చే సమస్యల్ని, తీర్చుకోవడం తప్ప చేసే దేముంది?" అడిగింది జూలీ.

"ప్రస్తుతం నా దగ్గర డబ్బులు కూడా లేదు. పైగా

అప్పులు కూడా వున్నాయి. నీ భేషజానికీ, సరదాలకు, విందులు వినోదాలకు నా సంపాదనంతా హారతి కర్పూరంలా అయిపోతూంటే, బ్లాక్ మెయిలర్‌కు కూడా తెచ్చి ఇవ్వడం ఎలా?" అడిగాను.

"ఆడదాన్ని నన్నడిగితే ఏం చెప్పగలను?" అంది ఉదాసీనంగా జూలీ.

"చెప్పొద్దు! నీ నగలు తెచ్చివ్వు. అవి అమ్మి అతని మొహాన డబ్బు కొడతాను!" అన్నాను.

"అవి బ్యాంక్‌లో పెట్టాను."

"ఎప్పుడు?"

"నిన్న!"

"నాకు చెప్పలేదేం?"

"దొంగతనాలు ఎక్కువగా అవుతున్నాయట మన చుట్టుప్రక్కల బంగళాల్లో. మా స్నేహితులు చెప్పారు బ్యాంకులో దాచమని" అంది జూలీ.

"దట్స్ ఓకే! రేపు వెళ్ళి తీసుకుందాం. నువ్వెళ్ళి మీ ఫ్రెండ్స్‌కు ఇంకా స్తతోగించు. బట్టలు ఇక్కడే విప్పి వేసుకోమను. నగ్నంగా రోడ్లో ఊరేగుతూ వెళ్ళమను ఇళ్ళకు. గెటవుట్!" అని అరచాను.

అలాంటి అవకాశంకోసం ఎదురు చూస్తుంది కాబోలు ఒక్క ఉదుటున పరుగెట్టింది క్రిందకు.

జూలీ వెళ్ళాక ఆలోచిస్తూ కూర్చున్నాను.

ఆ ఫోటోలు చూపించి ముందుగానే జూలీ దగ్గర డబ్బు రాబట్టాడు ఆ రాజేష్ ఎవరో. నా దగ్గరకు మళ్ళీ అవే ఫోటోలతో వచ్చాడు ప్రకాష్ డబ్బుకోసం. అంటే ఇద్దరూ ఒకరే అయివుండాలి. లేకుంటే ఇద్దరిలో ఒక తను దీని వెనుకనున్న బ్రెయిన్.

పోలీసులకు రిపోర్టు చేద్దామనిపించింది.

వాళ్ళకూ, నాకు సంబంధ బాంధవ్యాలు అంత బాగా లేవు. ఈమధ్య పోలీసు డిపార్టుమెంటు పట్టే లంచాల గురించే సవివరంగా వార్తలు సేకరించి ప్రచురించాము. అవకాశం దొరికితే నన్ను కమ్ముల వెనక్కి త్రోసి అల్లరి పెట్టాలని చూస్తున్నారు వాళ్ళు. నా డ్రైవింగ్ లైసెన్సు రోజుకు పదిసార్లన్నా అడిగి చూస్తూ వుంటారు పోలీసులు.

క్రింద గానాబజానా జరుగుతూనే వుంది. ఇలా డబ్బునూ, కాలాన్నీ వృథా చేస్తూ, అదే జీవితమని మురిసిపోయే ఈ సొసైటీ లేడిస్ అంటే నాకు మంట. కానీ జూలీని సహిస్తున్నాను. ఆమెపై ప్రేమతో కాదు, ఆమెను వదిలేశానన్న అపఖ్యాతి తెచ్చుకోవడం ఇష్టంలేక!

మెరిసేదంతా బంగారుమనుకునీ, విరిసిన ప్రతి పువ్వు లోనూ పుప్పొడి వుంటుందనీ మోసపోయిన వాళ్ళల్లో నేనూ ఒకడ్ని. జూలీ అందాన్ని చూచి, అంత అందమైన మనసుంటుందనుకుని వెంటబడి వేధించి పెళ్ళాడాను. ఆ తర్వాత ఆమె అసలు విలువలు తెలిశాయి. చెయ్యగలిగింది లేక సర్దుకుపోవడం మొదలుపెట్టాను.

జూలీపైనుంచి నా దృష్టి బ్లాక్ మెయిలర్ పైకి వెళ్ళింది.

ప్రకాష్ సామాన్యుడు కాదు.

నన్నూ, జాలీని పట్టుకొన్నట్లే, మిగిలిన వాళ్ళనుకూడా పట్టి వేధిస్తుంటాడనిపించింది. వెంటనే నాకు రామారావూ, కపూర్ గుర్తుకొచ్చారు. ఈపాటికి వాళ్ళవద్ద కూడా డబ్బు డిమాండ్ చేసుంటాడు.

ఒక్కొక్కరమే, అతని డబ్బుల్లో పడి, పాపర్లు కావడంకన్నా, అందరం కలిసి ఒక ప్లాను ఆలోచించి మా జోలికి రాకుండా వుండే మార్గం కనిపెట్టలేక పోతా మానిపించింది.

అయితే అసలీ విషయం వాళ్ళతో ఎలా జెప్పాలి అన్నది పెద్ద సమస్యయి కూచుంది. నాకై నేను వెళ్ళి అడిగితే తమ శ్రీమతులు అలాంటివారు కాదని, నేనెదు ర్కొంటున్న సమస్యలాంటి సమస్య ఏదీ వాళ్ళను నిద్రా హారాలు లేకుండా చెయ్యడం లేదని బుకాయించగలరు. వాళ్ళ నోటంటే విషయం రాబట్టాలనుకున్నాను. అందు కేదయినా దారి దొరుకుతుందని ఆలోచించసాగాను.

జూలీ అంతకుముందొచ్చినప్పుడు వదలి వెళ్ళిన బ్రాందీ గ్లాసు కనుపించింది. తీసుకుని గడగడ త్రాగేశాను.

ఆ రసం గొంతులోకి జారగానే గుండెల్లో అంతకు ముందుదాకా లేని ధైర్యమేదో పుట్టుకొచ్చినట్లయింది.

లేచి హాలంతా అడుగులతో అటూ ఇటూ పొడవు కొలిచాను పది నిముషాలు. క్రిందనుండి ఏవిధమైన శబ్దం రాలేదు. బహుశా అందరూ త్రాగి పడుంటారనుకున్నాను.

డ్రెస్ చేసుకొని క్రిందికొచ్చాను.

ఎవ్వరూ లేరక్కడ.

జూలీ మాత్రం సోఫాలో అర్ధనగ్నంగా పడివుంది.

తలుపులు దగ్గరకంటా మూసి, వెలుపలనుండి గొళ్ళెం పెట్టి కారెక్కాను. తిన్నగా రామారావు ఇంటి ముందుకు పోనిచ్చాను. బంగళానిండా లైట్లు వెలుగుతున్నాయి. కిటికీలగుండా పడుతున్న వెలుతురును చూసి ఆ విషయం పసిగట్టాను.

గేటు తెరచుకొని లోనికి వెళ్ళాను.

మెయిన్ డోర్ ప్రక్కనున్న కాలింగ్ బెల్ నొక్కేందుకు ప్రయత్నం చెయ్యోత్తాను. నా వీపుమీద ఏదో చెయ్యి పడింది.

తప్పున వెనక్కి తిరిగిచూశాను.

రామారావు కనుపించాడు.

నా ప్రయత్నం విరమించుకొని అతనికేసి చూశాను.

"ఏమిటింత రాత్రప్పుడు వచ్చారు? నా కోసమేనా?" అడిగాడు రామారావు.

"మీకోసమే!" అన్నాను.

"నా వైఫ్ మీ యింట్లోనే వుందా?"

"లేదు! ఇంతకుముందే వచ్చినట్లుంది అక్కడ్నించి, మీతో కొద్దిగా మాట్లాడాలి! అలా వెళ్దాం వస్తారా?" అడిగాను అతన్ని.

"రహస్యమా?" అడిగాడు రామారావు.

"అలాంటిదే!" అన్నాను నేను.

"పదండి!" అంటూ గేటు వైపు నడిచాడు రామారావు.

3

నేను స్టీరింగుముందు కూర్చున్నాను. రామారావుగారు నా ప్రక్కనే వున్నారు. కారు స్టార్టుచేశాను. కొంత దూరం వచ్చాక, 'కపూర్'గారి బంగళా ముందాపాను.

"ఎందుకాపావు?" అడిగాడు రామారావు.

"కపూర్‌గార్ని కూడా పిల్చుకొస్తాను" అన్నాను.

"ఆయనెందుకు?"

"చెప్తాను. ఆయన్ను గూడా రానీండి!" అన్నాను.

అర్థంగానట్లు రామారావు నాకేసి అయోమయంగా చూశాడు.

నేను కారుదిగి వెళ్ళి, గేటు తీసుకొని లోనికి వెళ్లాను. కపూర్‌గారు లాన్‌లో కుర్చీ వేసుకుని, పేపరు చదువుతున్నారు మెర్క్యూరీ లైటు వెలుగులో.

నా ఉనికిని తెలియజేస్తూ దగ్గాను చిన్నగా.

ఆయన తలెత్తిచూసి "మీరా? రండి" అన్నాడు కపూర్ ఆప్యాయంగా.

"అలా వెళ్దాం రండి! మీతో కొద్దిగా మాట్లాడాలి!" అన్నాను.

"ఏమిటి విశేషం" లేచే ప్రయత్నం చెయ్యకుండానే అడిగాడు.

"చెప్తాగా! రండి! ఇప్పుడే వచ్చేద్దాం!" అన్నాను.

కపూర్‌గారు పేపరు పారేసి అలానే లేచి నా వెంట వచ్చాడు. కారు డోర్ తీశాను. ఆయన ఎక్కి వెనుక సీట్లో కూర్చున్నాడు.

"రామారావుగారూ మీరా?" అడిగాడు కపూర్ నా ప్రక్కనున్న మనిషిని.

"అవునండీ! బావున్నారా? ఎలా వుంది వ్యాపారం?" అడిగాడు రామారావు.

"బాగుంది. ఏమిటీ హడావుడి?" అడిగాడు కపూర్.

"ఏమో? నాకు తెలీదు!" అన్నాడు రామారావు.

కారు స్టార్టు చేశాను.

"కొంపదీసి మామీద ఏదైనా ఆర్టికల్ రాయబోతున్నావా మీ పత్రికలో" అడిగాడు కపూర్.

"అబ్బే! అలాంటిదేమీ లేదు!" అన్నాను.

"అయితే మమ్మల్నెక్కడకు తీసుకెళ్తున్నావ్?" అడిగాడు రామారావు.

అంతలోనే లజ్ కార్నర్ కెళతల అమృతాంజన్ వారి పార్కు ప్రాంతానికొచ్చింది కారు. అక్కడ ఆపాను.

ముగ్గురం దిగి లోనికెళ్ళాం.

బాగా ప్రొద్దుపోవడంవల్ల జనం అంతగా లేరు.

నిర్మానుష్యంగా వున్న ఒక మూలకు నడిచాను. వాళ్ళిద్దరూ నన్ను అనుసరించి వచ్చారు. అందరం కూర్చున్నాం.

చెప్పటం మొదలెట్టాను.

"నేను మద్రాసు వచ్చి మూడు మాసాలపైన కొద్ది రోజులయింది. మీకన్నా పరిచయస్తులు, నాకెవ్వరూ లేరు. మనం మన శ్రీమతుల ద్వారా సుపరిచితులం. నేనొక పెద్ద సమస్యను ఎదుర్కోవలసి వచ్చింది. బహుశా మీ ఇద్దరు కూడా అలాంటి సమస్యను ఇంతకుముందే ఎదుర్కొని వుండివుండాలి! లేదా ఇవాళో, రేపో, ఎదుర్కోవలసిన అగత్యం కలుగుతుంది" ఆపాను చెప్పటం.

"మాకేం సమస్యలు లేవు!" అన్నారిద్దరూ ముక్త కంఠంతో.

"మీకు 'తృప్తి' సూపర్ బజార్ తెలుసా?"

"తెలుసు!" అన్నారు వాళ్ళు.

"అక్కడ పనిచేస్తున్నానని చెప్పుకొంటూ రాజేష్ అన్న పేరుతోనున్న వ్యక్తిగానీ, లేక ప్రకాష్ అనే మనిషిగానీ మీ దగ్గరకు వచ్చాడా?"

"రాలేదే!" అన్నాడు రామారావు.

"ఎందుకొస్తాడు?" అడిగాడు కపూర్.

జూలీ చేసిన దొంగతనం, దాని తాలూకు ఫోటోల విషయం, ప్రకాష్ వచ్చి పదివేలిమ్మని అడిగిన వైనం వివరంగా చెప్పాను.

"అయితే అది మీ సమస్య! మాకేం సంబంధం లేదు!" అన్నారిద్దరూ.

"అవును! కానీ అతని దగ్గరున్న ఫోటోల్లో మీ శ్రీమతులు కూడా వున్నారు, దొంగతనాలు చేస్తూ."

"నువ్వు చూశావా?" అడిగాడు కపూర్.

"ఆఁ!" అన్నాను.

"నా భార్య అలాంటిది కాదే! ఆమెకు ఏ విషయంలోనూ నేను ఎదురు చెప్పను. కావలసినంత డబ్బు తీసుకెళ్తుం టుంది. అందువల్ల అలాంటి నీచానికి పాల్పడవలసిన అవసరం ఆమెకు లేదు!" అన్నాడు రామారావు.

"అవసరాలతో ప్రసక్తి లేదీ పాడు పనులకు. ఇది ఒక విధమైన జబ్బు. డబ్బుగల వాండ్లలోనూ వుంటుంది ఎక్కువగా."

"మానుంచి మీకేం సాయంకావాలి! అతనడిగిన పది వేలూ మమ్మల్ని చెరో ఐదువేలు సర్దమని అడిగేందుకు, ఈ లేనిపోని కట్టుకథలు చెప్పి, మమ్మల్ని మీరు బ్లాక్ మెయిల్ చెయ్యాలనుకున్నారా?" అడిగాడు కపూర్.

"నాన్సెన్స్! ఆ ప్రకాష్ అసాధ్యుడిలాగున్నాడు. అతని ఆట కట్టించేందుకు మనం ముగ్గురం కలసి ఏదైనా ప్లాన్ ఆలోచించాలన్న ఉద్దేశ్యంతో ఇక్కడికి తీసుకొచ్చాను. బ్లాక్ మెయిల్ చెయ్యాలనికాదు!" అన్నాను.

రామారావు కపూర్ కేసి చూశాడు.

కపూర్ కూడా రామారావు వైపు చూశాడు.

ఇద్దర్నీ గమనించసాగాను.

"పాపం నిజంగా మీరు పెద్ద చిక్కుల్లోనే పడ్డారు. మావల్ల మీకేం సాయంకావాలో చెప్పండి. చేస్తాం!" అన్నారిద్దరూ.

"మీకు అవసరం, ప్రయోజనం లేనప్పుడు ఇందులో తలదూర్చడం అనవసరం. నా తిప్పలు నేను పడతాను. మీరు వెళ్ళండి!" అన్నాను ఉడుక్కుంటూ. నాకన్నా వాళ్ళు తెలివిగల వాళ్ళేమోననిపించింది. నేను దూరం ఆలోచించకుండా, వీళ్ళతో కలిసి కట్టుగా వుండి, కట్టుదిట్టమైన పథకం తయారుచేసి ప్రకాష్ పని పట్టించాలని తయారుచేసి ప్రకాష్ పని పట్టించాలని దురాశపడ్డానేమో ననిపించింది కూడా. దానికన్నా, నా రహస్యం వీళ్ళకు చెప్పినందుకు బాధపడ్డాను.

జీవితంలో మొదటసారిగా నా తెలివితేటలపైనున్న నమ్మకం సడలిపోయింది.

మెల్లగా లేచాను.

నాతోపాటు వాళ్ళూ లేచారు.

"రండి! మిమ్మల్ని డ్రాప్ చేసి వెళ్తాను" అన్నాను.

అందరం కారెక్కాం.

"ఎలా గొడవ వెలుపలికి పొక్కకుండా చూసుకోండి! తెలిస్తే అందరూ మిమ్మల్ని చూసి నవ్వుతారు!" అన్నాడు రామారావు ఉచిత సలహా పారేస్తూ.

"ఆమె ఇలాంటి పొరపాటు చేసి వుండవలసింది గాదు!" అన్నాడు కపూర్.

నాకు చిర్రెత్తుకొచ్చింది. జూలీ చేసింది తప్పయినా, వీళ్ళ పెళ్ళాలు చేసిన తప్పులు కప్పెట్టుకొని నా భార్య గురించి వ్యాఖ్యానించడం నాకు నచ్చలేదు.

"ఆమె సంగతి నేను చేసుకొంటాను. ఈ సమస్య మీకు ఎదురయినప్పుడు నా సలహాకు రాకండి. మీ దారి మీరు చూసుకోండి!" అన్నాను.

వాళ్ళేమీ మాట్లాడలేదు.

కారు మా వీధిలోకి రాగానే ఇద్దరూ దిగిపోయారు.

నేను తిన్నగా ఇంటికొచ్చాను.

జూలీ అలానే పడుకుని వుంది. ఆమెను కదపకుండా పైకి వెళ్ళిపోయాను. మెయిన్ డోర్ మూసి గొళ్ళెంపెట్టి.

4

ఆఫీసు గదిలోకి అడుగుపెట్టాను మరుసటిదినం.

నా వెనుకనే వచ్చింది వనజ.

"మార్నింగ్!" అంది నేను కూర్చోగానే.

"గుడ్ మార్నింగ్! కూర్చో!" అన్నాను.

ఆమె చీర అందంగా సర్దుకుని కూర్చుంది.

"ఎనీ న్యూస్!" అన్నాను సిగరెట్ వెలిగించుకుంటూ.

"మీరు వెళ్ళాక బాస్ ఫోన్ చేశారు. అర్జంటుగా మాట్లాడాలన్నారు. లేరని చెప్పాను. కాస్త చికాకుపడ్డారు. ఏదో అవసరమైన పనిమీద వెళ్ళారని సర్ది చెప్పాను. ఇవాళ వచ్చి కలవమన్నారు. మధ్యాహ్నం ఢిల్లీ వెళ్తారట. వెళ్ళేముందు మిమ్మల్ని చూడాలన్నారు" అంది వనజ.

"అలాగే! మరో అరగంటలో వెళ్దాం!" అన్నాను.

"ఫోన్ చేసి చెప్తాను వస్తున్నామని!" అంది.

"అలాగే!" అన్నాను.

వనజ లేచింది వెలుపలకు వెళ్ళేందుకు.

"జేమ్స్ వచ్చాడా?" అడిగాను.

"వచ్చాడు. పంపనా?" అడిగింది.

"పంపు. అర్జంటుగా మాట్లాడాలి!" అన్నాను.

ఆమె వెళ్ళిపోయింది.

ఆలోచిస్తూ కూర్చున్నాను.

జేమ్సు మా పత్రిక తరఫున పనిచేసే ఇన్వెస్టిగేటర్. ఉక్కునరాల మనిషతను. చూచి రమ్మంటే కాల్చి వస్తాడు. అంతకుముందో డిటెక్టివ్ ఏజన్సీలో పని చేశాడు. చాలా విషయాలపైన నేను రాసిన ఆర్టికల్స్‌కు అవసరమైన సాక్ష్యాధారాల్ని అతనే సంపాదించాడు. అతనికి నేనంటే అభిమానం. నాకూ అతనంటే చాలా గౌరవం.

"మార్నింగ్ సర్!" అంటూ వచ్చి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు జేమ్స్.

"మార్నింగ్. నాకు అర్జంటుగా ఒక పని చేసి పెట్టాలి" అన్నాను.

"ఏం పని చెప్పండి!"

"అభిరామపురంలో వుండే 'తృప్తి' సూపర్ బజారు పేరు బహుశా నువ్వు వినే వుంటావ్! అక్కడ ప్రకాష్ అనే అతను పని చేస్తున్నాడు. కొందరు రాజేష్ అని పిలుస్తారతన్ని. అతన్ని గురించి తెలిసిన సమాచారం మొత్తం కావాలి నాకు." అన్నాను.

"అలాగే! కానీ దానివల్ల మనకు పెద్ద ప్రయోజనముంటుందనుకోను." అన్నాడు జేమ్స్.

"అంటే..." అతని ఉద్దేశ్యం అర్థంగాక చూశాను.

"మీరివాళ పేపరు చూడలేదా?" అడిగాడు జేమ్స్.

"లేదు! నిద్ర లేచేసరికి లేటయింది."

"మీ సెక్రెటరీని తెమ్మనండి. చూద్దురుగాని!"

"నీ మాటల్లో మిస్టరీ నాకు అర్థం కావటంలేదు. ఏముంది పేపర్లో? నువ్వే చెప్పరాదూ!" అన్నాను.

"ఆ ప్రకాష్ అనే వ్యక్తిని వేకువ ఝామున ఎవరో రివాల్వరుతో కాల్చి చంపారుట. పోలీసులు రంగంలోకి

దూశారు. ఇంకా ఏవిధమైన సాక్ష్యాధారాలు దొరక లేదు." అన్నాడు జేమ్స్.

"రియల్లీ!" అడిగాను ఆశ్చర్యంగా.

"అవును." అన్నాడు నిశ్చలంగా నా కళ్ళకేసి చూస్తూ.

"అతను చచ్చినంత మాత్రాన, అతన్ని గురించి తెలుసుకోవలసిన అవసరం ఆగదు. నువ్వేలాగైనా నాకు అతని పూర్తి వివరాలు కావాలి! తెస్తావా?" అడిగాను.

"తెస్తాను. కానీ ఎందుకనేది తెలుసుకోవటం నా అల వాటు. ఆ సంగతి మీకూ తెలుసు."

"ఇప్పుడిప్పుడే చెప్పలేను. కానీ చెపుతాను సమయం చూసి" అన్నాను.

జేమ్స్ ఆ విషయం గురించి పట్టుదల వహించలేదు. లేచి వెళ్ళిపోయాడు.

వనజ ఫోన్లో చెప్పింది కారు సిద్ధంగా వుందని.

సూట్ సర్దుకొని, తయారుచేసిన ఆర్టికల్స్ తీసుకుని గది వెలుపలికొచ్చాను.

వనజ రెడీగా వుంది.

నేను ముందూ, ఆమె వెనుకా నడవసాగాం.

ఆమె నడక కూడా అందంగా, అలవోకగా, పిల్లగాలి తెమ్మరలకు కదిలే పంట చేలపై కనుపించే తెరలుగా వుంటుంది.

ఇద్దరం కారెక్కాం.

కారు ఊరికి మూలగానున్న అన్నానగర్ వైపు పరు గెత్తసాగింది.

'జలాల్ మేన్షన్స్' ముందు ఆగింది.

విశాలమయిన డ్రాయింగ్ రూంలో కూర్చునివున్నాడు జలాల్. అతని వయస్సు యాభై దాటి వుంటుంది. అయినా దిట్టంగా కనుపిస్తాడు. ఆయన శ్రీమతి, మనుమూ బేగం కూడా వుందక్కడే.

"పోయినవారం మీరు పబ్లిక్ వర్క్స్ డిపార్టు మెంటులో లంచాల తీరుతెన్నుల గురించి రాసిన ఆర్టికల్ చాలా బాగా వచ్చింది. నాకు ముఖ్యమంత్రి దగ్గరనుండి నాలుగైగు ఫోన్లు వచ్చాయి. ఇలాంటివి రాయవద్దని బ్రతిమ లాడుతున్నారు. వీలుకాదని చెప్పాను. పోలీస్ డిపార్ట్ మెంటు గురించి నువ్వు తయారుచేసిన వివరాలు చూశాను. బాగున్నాయి. పైవారం దాన్ని ప్రచురించే ఏర్పాటు చేస్తావా?" అడిగాడు జలాల్ నన్ను చూడగానే.

"మరీ అంత తొందరపడడం మంచిది కాదేమోనని పిస్తూంది. మరో రెండు వారాలు ఆగితే ఎలా వుంటుం దంటారు." అడిగాను అనుమానిస్తూ.

"ఏం! ఏమైనా కాంప్లికేషన్స్ ఉన్నాయా?"

"అలాంటివేమీ లేవు! మనదగ్గర వేరే మాటర్ వుంది. అదయ్యాక వేస్తే బాగుంటుందేమోననిపిస్తూంది. అదీగాక పోలీసులతో వ్యవహారం. ఒకటికి రెండుసార్లు, అన్ని విషయాలు తిరిగి సరిజూసుకోవడం మంచిది కూడాను" అన్నాను.

"ఆల్ రైట్! అలాగే కానీ! నేనివాళ ఢిల్లీ వెళు న్నాను. హోం సెక్రెటరీ అర్జంటుగా రమ్మని కబురు పంపాడు. మనదగ్గరున్న వివరాలు బహుశా వాళ్ళకు కావాలనుకుంటాను. వాట్ని ఆధారంగా పెట్టుకొని, అవినీతిపరులపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని చూస్తు న్నట్లు తెలిసింది" అన్నాడు జలాల్.

"గుడ్ న్యూస్!" అన్నాను.

"మరో విషయం! నీకు ఇంతకు ముందోసారి చెప్పాను. మనం నడిపే పత్రిక 'భాజా' నడుపుతున్న నేనెంత, అవినీతికీ, ధర్మానికీ దూరంగా వున్నానో, దాని సంపాదకుడివిగా నువ్వూ అలాగే వుండాలి. మనగురించి మరొకరు వేలెత్తి చూపే అవకాశం ఇవ్వగూడదు. అది జరిగిననాడు, మనం ఆత్మహత్య చేసుకోవటం వినా మరో మార్గముండదు. నావల్ల ఏం సహాయం కావలసినా చెప్పు చేస్తాను" అన్నాడు జలాల్.

"నేను బాగున్నాను. నాకేం ప్రస్తుతం అవసరంలేదు!" అన్నాను.

'ఆల్ రైట్! నువ్వెళ్ళవచ్చు!" అన్నాడు జలాల్.

5

ఆఫీసుకు తిరిగివచ్చాక నాకు ప్రకాష్ ఆకస్మికమరణం సంగతి గుర్తొచ్చింది.

పోలీసులు కేసులెలా పరిశోధించేది నాకు బాగా తెలుసు. ముందురోజు నా దగ్గరకొచ్చిన విషయం గురించి తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు వాళ్ళకు.

తీరా తెలుసుకొని వచ్చాక, ప్రకాష్ నా దగ్గరకెందుకొచ్చిందీ చెప్పే వీలులేదు. ఆ విషయం చెప్పానంటే ముందు నన్నే అనుమానిస్తారు. అసలే నాపైన పోలీసు డిపార్టుమెంటుకు కోపంగా వుంది. వీలైనన్నివిధాల ఇబ్బంది పెట్టే అవకాశంకోసం ఎదురుచూస్తున్నారు.

బల్లపైనున్న ఫోన్ మ్రోగింది.

రిసీవరు తీశాను.

"మిస్టర్ రఘూ!" అడిగింది అవతలివేపు కంఠం.

"యస్!" అన్నాను నేను.

"నా కంఠం గుర్తుచిక్కలేదా! రామారావును మాట్లాడుతున్నాను" అన్నాడతను.

"మీరా? ఏమిటి విశేషం?" అడిగాను.

"మొత్తానికి నువ్వు గుండెలు తీసిన బంటువయ్యా! ఆ ప్రకాష్‌గాడ్ని కాస్తా పైకి పంపించావ్?" అన్నాడు రామారావు.

నాకు ముచ్చెమటలు క్రమ్ముకొచ్చాయి. రాత్రి వీళ్ళతో నా బాధ చెప్పడం తప్పయిపోయిందని తెలిసింది. నన్నే అడగగలిగిన మనిషి మరెవరికైనా ఆ మాటే చెప్పకుండా వుంటాడన్న గ్యారంటీ ఏమీ కనుపించలేదు.

"ఎవరు చెప్పారు మీకు?" అడిగాను.

"ఒకరు చెప్పడ మేమిటి! నాకు తెలుసుగా?!" అన్నాడు రామారావు.

"అయితే ఇప్పుడెందుకు ఫోన్ చేశారు?"

"నీతో బేరం కుదుర్చుకోడానికి."

"బేరమా?" అడిగాను అర్థంగాక.

"అవును. రాత్రికి నిన్న మనం కలుసుకున్న పార్కుకు రా! నీ కోసం కాచుకుని వుంటాను పదిగంటల తర్వాత!" అని ఫోన్ పెట్టేశాడు రామారావు.

నాకు తల గిర్రున తిరిగిపోయింది.

ఫోన్ క్రేడిల్ పైన పడేశాను.

రాత్రి నేను తొందరపడకుండా వుండి వుండవలసిందనిపించింది. ఇప్పుడు దాన్ని గురించి ఆలోచించడంకన్నా, నాకు నేనై ఈ ఊబిలో ఇరుక్కుపోకుండా వుండే మార్గం కోసం అన్వేషించసాగాను.

ఇంటర్‌కామ్ బజర్ మ్రోగింది.

"సార్!" వనజ కంఠం వినిపించింది.

"ఎంత సేపయింది వచ్చి?" అడిగాను.

"ఇప్పుడే! మీతో మాట్లాడాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావుగారు వచ్చారు. వెయిట్ చేస్తున్నారు. పంపేదా?" అడిగింది వనజ. నా గుండె ఒక్క క్షణం కొట్టుకోవడం మానేసింది.

"ఎందుకొచ్చారో తెలుసా?"

"తెలీదు!"

"ఆల్ రైట్! పంపించు." అన్నాను.

రెండు నిముషాల తర్వాత ఫుల్ యూనిఫాంలో వున్న ఆరడుగుల ఆజానుబాహు విగ్రహం, గుమ్మంలో ప్రత్యక్షమైంది.

"ప్లీజ్ కమిన్!" అన్నాను కూర్చొనే.

అతను వచ్చి కూర్చున్నాడు నా కెదురుగా వున్న కుర్చీలో.

"మా డిపార్టుమెంట్ గురించి మీకంత సదభిప్రాయం లేకున్నా, మీరంటే వ్యక్తిగతంగా నాకు అంతులేని అభిమానం, గౌరవం వున్నాయి," అన్నాడు ఈశ్వరరావు.

"థాంక్స్!" అన్నాను.

"మీ దగ్గరకోసారి వచ్చి కంగ్రాచ్యులేషన్స్ చెప్పి వెళ్ళాలని చాలా రోజులనుంచి అనుకుంటూ వుండి పోయాను. వీలుకాలేదు. ఇప్పుడో చిన్న పని తగిలి, మీ దగ్గరకు రావలసి వచ్చింది." అన్నాడు ఈశ్వరరావు.

"ఏం పనిమీదొచ్చారు?" అడిగాను.

"తృప్తి, సూపర్ బజార్‌లోని సూపర్‌వైజర్‌గా పని చేసే ప్రకాష్ అనే వ్యక్తిని ఎవరో కాల్చి చంపారు.

అతని గురించి వాకబు మొదలెట్టాం. అతను నిన్న ఇక్కడికి వచ్చి మీతో కొంతసేపు మాట్లాడి వెళ్ళినట్లు తెలిసింది. అతన్ని గురించి మీరేమైనా వివరాలు చెప్పగలరా?'' అన్నాడు ఈశ్వరరావు.

అతను నా దగ్గరకు రాలేదని బుకాయించి లాభం లేదు. ఏం చెప్పినా నాపైకి అనుమానం రాకుండా చూసుకోవాలని ఆలోచించి నిర్ణయించుకొన్నాను.

''అతనెవరో నాకు తెలీదు! నిన్ననే వచ్చాడు. ఆ సూపర్ బజార్ ప్రైవేట్ వ్యక్తులు నడుపుతున్నారు. అక్కడ కల్తీ సామానులెలా అమ్మేదీ, తూకం తగ్గించి ఎలా ఖాతాదార్లని మోసం చేసేదీ, ఇండియాలో తయారయిన వస్తువుల్నే, పాకింగ్ మార్చి ఫారిన్ గూడ్సు క్రింద ఎలా చెలామణీ చేసి అమ్ముతున్నదీ, తనకు తెలుసుననీ, అన్నీ వివరంగా రాసిస్తాననీ అన్నాడు. నన్ను 'భాజా'లో ఆ సమాచారం వివరంగా రాసి ప్రచురించమన్నాడు. దానివల్ల కనీసం, ప్రజలు జాగ్రత్తపడతారని అతని ఊహ!'' అన్నాను.

''మీరేమన్నారు?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

''చూద్దామన్నాను.''

''అంటే అతనికీ, మేనేజిమెంటుకూ ఏదో రగడ జరిగివుండాలి. అందుకే అతను వాళ్ళ రహస్యాల్ని రచ్చకీడ్చి, వాళ్ళను అల్లరిపాలు చెయ్యాలని ఆలోచించుకొని, మీ దగ్గరకు వచ్చివుంటాడు. ఈ విషయం తెలిసిన ప్రొప్రయిటర్లు అతన్ని చంపించి వుండాలి! ఏమంటారు?'' అన్నాడు ఈశ్వరరావు నాకేసి చూస్తూ.

''ఏమో? నేనెలా చెప్పగలను'' అన్నాను.

"అతన్ని ఇంట్లోనే కాల్చి చంపారు. మేము ఇల్లంతా తనిఖీ చేశాం. చిన్న ఫోటో స్టూడియో వుంది. ఖరీదైన కెమెరా వుంది. కానీ పాజిటివ్ లుగానీ, నెగటివ్ లుగానీ, ఒక్కటీ దొరకలేదు. అతని సామానంతా గాలించాం. లాభంలేకపోయింది. మాకన్నా ముందే సామాన్లన్నీ ఎవరో వెతికినట్లు చిందరవందరగా పడున్నాయి. ఇది విచిత్రంగా లేదూ!" అడిగాడు ఈశ్వరరావు మళ్ళీ.

"ఏది?" అర్థమయినా, కానట్లు నటించాను.

"ఫోటోలూ, నెగటివ్ లూ, లేకుండటం" అన్నాడు.

"ఆఁ! విచిత్రంగానే వుంది!" అన్నాను.

"సూపర్ వైజర్ గా పనిచేసే మనిషి, ఇంట్లో చిన్న ఫోటో స్టూడియో నడపటం, ఇల్లంతా చిందరవందరగా వుండడం, ఎవరో రివాల్వర్ తో అతన్ని కాల్చి చంపడం లాటివి చూస్తుంటే, బ్లాక్ మెయిలింగ్ కేసులా గూడా అనిపిస్తూంది. కాదంటారా?"

"నేను అనటానికి ఏముంది? వీటిల్లో మీకు అపారమైన అనుభవం వుందిగా!" అన్నాను.

"వస్తానండీ! మీరు మాకు చెప్పటానికి మరచిపోయిన విషయమేదైనా గుర్తొస్తే మాకు ఫోన్ చేయండి. వచ్చి కలుసుకుంటాను." అంటూ లేచి, నాతో కరచాలనం చేసి వెళ్ళిపోయాడు ఈశ్వరరావు.

తలుపు మూసుకున్నాక రక్కన కూలబడ్డాను కుర్చీలో గండం గడిచినందుకు.

ఇంతకూ, ఆ ప్రకాష్ ముందురోజు నాకు చూపించిన ఫోటోలూ, తన దగ్గరున్నాయని చెప్పిన నెగటివ్ లు ఏమయి వుంటాయని ఆలోచించసాగాను. హాత్య చేసిన

మనిషే వాటిని చేజిక్కించుకొని వుండాలి. అంటే నా రహస్యం కూడా అతని చేతుల్లో వుంది. పోలీసులకన్నా ముందు నేను హంతకుణ్ణి పట్టుకోవడం అవసరమనిపించింది. దానికి తగిన ప్రయత్నాలెలా చెయ్యాలని ఆలోచించసాగాను.

6

మళ్ళీ ఫోన్ మ్రోగింది.

అయిష్టంగా, అలసటగా, భయంతో అందుకున్నాను రిసీవరు.

"మీ మిసెస్ లైన్లో వుంది. కనెక్ట్ చేసేదా?" అడిగింది వనజ.

"ఊఁ!" అన్నాను.

మరుక్షణంలో జూలీ కంఠం వినిపించింది "హల్లో" అంటూ.

"ఆఁ! నేనే! ఏమిటి హడావుడి?" అడిగాను.

"మీ రివాల్వరు ఎక్కడ పెట్టారు?" అడిగింది జూలీ.

"నా గదిలో బీరువాలో."

"అది మన ఇంటిముందున్న తోటలో పూలమొక్కల మధ్య దొరికింది. తెరచిచూస్తే అందులో ఒక తూటా తక్కువుంది" అంది జూలీ.

"నోర్మూయ్! ఈ విషయం ఫోన్లోనా చెప్పేది. నే వస్తాను. అందాకా నోరుమూసుకుని వుండు!" అన్నాను కంగారుపడుతూ.

"సరే! త్వరగా రండి!" అంటూ ఫోన్ పెట్టేసింది.

నా కణతలు వేడెక్కాయి. ఈశ్వరరావు వచ్చి ప్రకాష్‌ను రివాల్వరుతో ఎవరో కాల్చిచంపారని చెప్పాడు. ఇప్పుడు నా రివాల్వరులో ఒక తూటా తక్కువుందని జూలీ ఫోన్ చేసింది.

నా మెదడుచుట్టూ ఎవరో పెద్ద ఉరి బిగిస్తున్నట్లు అర్థం చేసుకొన్నాను.

నాకున్న ఒకే ఒక ఆశాకిరణం జేమ్స్. అతను సంపాదించుకొచ్చే సమాచారంలోంచే, హంతకుడెవరయివుంటాడో ఊహించాలి నేను. అతన్ని పోలీసులకు పట్టివ్వాలి. అంతకుముందుగానే అతనివద్దనున్న ఫోటోల్ని కాజెయ్యాలి. ఇదీ నా ప్లాను. ఎంతదాకా నెరవేరుతుందో నమ్మకంగా మాత్రం తెలియటంలేదు.

వనజ లోనికి వచ్చింది.

నా అనుమతికోసం ఎదురు చూడకుండానే కూర్చుంది.

ఆమె ప్రవర్తన వింతగా తోచింది. ఆశ్చర్యపోతూ ఆమెకేసి చూశాను.

"మీ రెందుకో కంగారుపడిపోతున్నారు. అది వ్యక్తిగత విషయమే అయినా, సెక్రటరీగా, మీ మంచి చెడ్డలు చూడటం నా విధి. నా అవసరం ఏదన్నావుంటే చెప్పండి. సాయం చేస్తాను!" అంది వనజ.

మాట్లాడకుండా చూశాను ఆమెకేసి.

"ఆ ప్రకాష్‌ను మీరు హత్యచేశారా?" అడిగింది సూటిగా వనజ.

"లేదు!" అంటూ "అయినా ఇదంతా నీకెలా తెలిసింది?" అడిగాను కోపంగా.

"మీ సెక్రెటరీని, అవసరం లేకున్నా తెలుస్తాయి కొన్ని. రివాల్వరు గురించి మీ ఆవిడ ఇంతకుముందు నాతోనే గడగడ వాగేసింది. నాకు తెలిసిన మరికొన్ని విషయాలు చెప్తాను. వినండి. ప్రకాష్ హత్య పాయింట్ ముప్ఫయి ఎనిమిది కాలిబర్ రివాల్వరుతో జరిగింది. మీ

రివాల్వరు కూడా ఆ జాతిదే! ముందు దాన్ని వదలించు కోవడం వివేకమనిపించు కుంటుంది'' అంది వనజ.

నిముషనిముషానికీ నా రహస్యం తెలిసినవాళ్ళు ఎక్కువ కావడం నాకు కంపరం కలిగింప జేస్తూంది.

''అవును'' అన్నాను నెమ్మదిగా.

''ఆఁ! అదీ మీరు ప్రయత్నిస్తే ఎవరైనా పట్టుకోవచ్చు. అందువల్ల దాన్ని తెచ్చి నాకివ్వండి. నేను ఊరవతల ఏ మురుగు కాల్వలోనో పారేస్తాను!'' అంది వనజ.

ఆమె నాకోసం అంతసాహసం చేసేందుకు సిద్ధమవడం సంభ్రమంలో ముంచెత్తింది.

''వద్దు! అనవసరంగా నా గురించి మీరు లేనిపోని గొడవల్లో చిక్కుకోవటం నాకిష్టంలేదు!'' అన్నాను.

''నాకు మీరంటే ఇష్టం. అందుకనే ఇష్టపడుతున్నాను కష్టాలనైనా కొని తెచ్చుకోవడానికి'' అంది వనజ.

''నాకు పెళ్ళయింది!'' అన్నాను, నావల్ల ఆమె పొంద కలిగేదేమీ లేదని చెప్తూ.

''నాకు కాలేదు! అయినా నాకు మీపైనున్న ఇష్టం పెళ్ళిని ఆశించేది కాదు! అదోరకం పిచ్చి. నా దృష్టిలో మీరో హీరో! హీరోలను పూజించే మన స్తత్వం నాది. ఐ వర్‌షిప్ యూ!'' అందామె.

''ఎక్కడకు తెచ్చిమ్మంటావ్?''

''ఎక్కడికో వద్దు! ఇప్పుడు ఇంటికివెళ్ళి పట్రండి. నాకు ఇచ్చేసి, మీరు నిశ్చింతగా నిద్రపోండి!'' అంది వనజ.

''ఓ. కే!'' అంటూ లేచాను.

7

ఇల్లు చేరేసరికి జూలీ ఆత్రుతగా ఎదురుచూస్తూంది.

"ఎక్కడ పెట్టావ్?" అడిగాను ఆమెను.

"కనుపించిన చోటే వదిలేశాను" అంది జూలీ.

"పద! చూపించు" అన్నాను.

ఆమె ముందు నడచింది. నేను వెంట వెళ్ళాను. గులాబీ చెట్టు మొదట్లో నల్లటి రివాల్వరు పడుంది. జేబురుమాలు మడతలువిప్పి దానిపైన వేశాను. రుమాలుతోనే పట్టుకొని అలాగే కోటుజేబులో పెట్టుకున్నాను.

"రాత్రి నీతో తాగితందనాలాడిన వాళ్ళల్లో ఎవరైనా దీన్ని దొంగిలించుకు పోయుంటారా?" అడిగాను.

"ఛీ! మీదంతా అనుమానం. వాళ్ళలాంటి మనుషులు కాదు!" అంది జూలీ.

"నోర్ముయ్! నువ్వూ, వాళ్ళూ అంతా దొంగలే! దువ్వెనలు, పౌడరు సీసాలు దొంగిలించగలిగిన వాళ్ళకు రివాల్వరు దొంగిలించడం పెద్ద విషయం కాదు!" అన్నాను.

"దీంతో అవసరం ఏముంది?"

"నీలాగే వాళ్ళనూ ఫోటోలు తీశాడు ప్రకాష్. డబ్బిమ్మని బెదిరించి వుంటాడు. ఇవ్వకుంటే వాళ్ళ భర్తల దగ్గర చేరం పెడతానని చెప్పివుంటాడు. దాంతో బెదిరి ఈ పనికి పాల్పడి వుంటారు" అన్నాను.

"ఏమో?" అంది జూలీ ఎటూ తేల్చుకోలేక.

"ఆ గొడవలు నాకు వదిలెయ్యి. నువ్వు ఎవ్వరితో అనకు. మన పరువు బజారున పడుతుందని మాత్రమే భయపడ్డాను ఇంతదాకా! ఇప్పుడు మనం కూడా జైల్లో పడేట్లుంది."

"మనం అంటే ఇద్దరమూనా? నాకేం కర్మ! నేను ఎవ్వర్నీ చంపలేదు!" అంది జూలీ.

దానికేమీ సమాధానం చెప్పలేదు. ఆమెతో మాట్లాడటం కూడా అనవసరమనిపించింది. కారెక్కి మళ్ళీ ఆఫీసుకేసి పోనిచ్చాను. ఇరవై నిముషాల్లో ఆఫీసు చేరుకున్నాను.

అప్పటికే గంట ఐదుదాటింది. అందరూ వెళ్ళిపోయారు. వనజ గదికేసి చూశాను. టైప్ చేసుకుంటూ వుంది. తిన్నగా నా గదిలోకి వెళ్ళి ఇంటర్‌కాన్‌లో పిలిచాను. ఆమె వచ్చింది.

జేబురుమాలులో చుట్టిన రివాల్వరు తీసి అలానే పెట్టాను టేబుల్ పైన. ఆమెకూడా దాన్నలాగే తీసుకుని హాండ్ బాగ్ లో దోపుకుంది.

"జాగ్రత్త!" అన్నాను.

"నాకు మరీమరీ చెప్పనవసరం లేదు! మీరు నిశ్చింతగా వుండండి!" అంటూ లేచి వెళ్ళిపోయింది.

నా గుండెలు చక్కబడ్డాయి. పైనున్న పెద్ద బరువేదో తొలగిపోయినట్లు తేలికగా అనిపించింది.

8

అందరూ వెళ్ళిపోయినా నేనేదో పనున్నట్లు ఆఫీసులోనే కూర్చున్నాను. నిజానికి నాకు పెద్ద పనిలేదు. ఇంటికి వెళ్ళడానికి మనస్కరించలేదు. జేమ్స్‌కోసం ఎదురు చూస్తున్నాను. అతను వచ్చి చెప్పగలిగే వివరాలపైనే నా భవిష్యత్తు ఆధారపడి వుంది.

గంటలు ముందుకు జరుగుతున్నాయి.

వాచీ చూసుకున్నాను. ఎనిమిదైంది.

జేమ్స్ వస్తున్న జాడమాత్రం లేదు. అతని ఇంటి అడ్రసు నాకు తెలుసు. వెళ్దామనుకున్నాను. గబగబ కాగితాలన్నీ సర్ది, సూట్ తొడుక్కుని, బ్రీఫ్ కేస్ చేత పెట్టుకొని, ఆఫీసు వెలుపలికొచ్చి కారెక్కాను.

కారు రివ్వున దూసుకుపోసాగింది టి. నగర్ వైపు. రామన్ స్ట్రీట్‌లోని పదహారవ నెంబరు ఇంటిముందు ఆపాను కారు. దిగి లోనికివెళ్ళి, వరండాలోంచి వున్న మెట్లెక్కి పైకి వెళ్ళాను.

జేమ్స్ గది తలుపులు లోపలనుండి మూసివున్నాయి. లైటు వెలుగుతూంది. దాని కాంతి, తలుపు పైనున్న వెంటిలేటరు ద్వారా నడవాలో పడుతూంది.

మెల్లగా తలుపు తట్టాను.

"ఎవరు?" అడిగిందో ఆడగొంతు లోనుంచి.

"జేమ్స్‌కోసం వచ్చాను. ఉన్నాడా?"

"లేదు! మీ రెవరో చెప్పండి" అంది అదే గొంతు మళ్ళీ.

"నా పేరు రఘు! 'భాజా' పత్రిక ఎడిటర్ని" అన్నాను.

"అతనొచ్చాక చెప్తాను" అందా గొంతు మళ్ళీ.

జేమ్స్ బాచెలర్‌గా వున్నాడు. అతనికి పెళ్ళికాలేదు. అతని గదిలోకి ఆడమనిషి ఎలా వచ్చిందాని ఆశ్చర్య పోయాను. ఒకవేళ అతని చెల్లెలో, బంధువుల అమ్మాయో, అయివుండవచ్చనుకుని, ఆమెగురించి ఆలోచనలు మాని "ఎప్పుడొచ్చేదీ చెప్పాడా జేమ్స్!" అడిగాను.

"లేదు!" అందామె తలుపు తెరవకుండానే.

ఇది కొంత వింతగా తోచింది నాకు. అంతలోనే సర్దు కున్నాను, రాత్రిళ్ళు పరాయి మగవాళ్ళతో ఒంటరిగా

వుండి మాట్లాడేందుకు ఆమె భయపడుతుందేమోనని.

"వెళ్ళొస్తాను!" అని చెప్పి క్రిందికొచ్చి కార్లో కూర్చున్నాను.

పదిగంటలకుపైన మళ్ళీ నాకు ఎంగేజిమెంటుంది రామారావుతో. అందాకా వేరేపనేం లేదు. కార్లోనే కూర్చుని వెయిట్ చేద్దామని అనుకున్నాను జేమ్సుకోసం.

సిగరెట్ కాల్చుకుని కూర్చున్నాను.

అరగంటపైనే గడిచింది.

చుట్టుప్రక్కల మేడల్లో వున్నవాళ్ళు నన్నూ, నా కారును చూస్తున్నట్లు అనుమానం వేసింది.

జేమ్స్ వుంటున్న ఇంట్లోంచి ఒక ఆడమనిషి రావడం గమనించాను. ఆమె లైటు క్రిందకు రాగానే పోల్చుకున్నాను. నా కళ్ళు బైర్లు క్రమ్మాయి. ఆశ్చర్యంతో అవాక్కయిపోయాను.

ఆమె ఎవరో కాదు! రామారావు భార్య రజని. ఆమె ఆమె జేమ్స్‌వద్ద కెందుకొచ్చిందాని ఆశ్చర్యపోయాను! బహుశా ఇద్దరికీ సంబంధముండి వుండాలి!

రోడ్డెక్కింది నడుస్తూ.

నేను కారు స్టార్టు చేసి ముందుకు పోనిచ్చి ఆమె వోరగా ఆపాను. ఆమె నాకేసి చూసింది. గజగజ వణికిపోయింది.

"కారెక్కండి! మిమ్మల్ని ఇంటిదగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాను.

"అఖ్ఖర్లేదు!" అంది రజని.

"అలా అనకండి! మనం చాలా మాట్లాడుకోవాలి! అలా నాతో మాట్లాడనంటే మీ రహస్యం కాపాడుతా

నని హామీ ఇవ్వలేను!'' అన్నాను.

ఏమనుకొందో తప్పుకున్న కార్కింది.

ముందుకు పోనిచ్చాను.

''జేమ్స్ నీ ప్రియుడా!'' అడిగాను.

అవుననిగానీ, కాదనిగానీ అనలేదు.

''ఆ విషయంలో నాకు ఇంటరెస్టులేదు! ప్రకాష్‌ను నీకు తెలుసుగదూ?''

''తెలుసు!'' అంది రజని.

''నిన్ను బెదిరించాడా?''

''ఊఁ!''

''ఎంతివ్వమన్నాడు?''

''పాతిక వేలు!'' అంది రజని తలొంచుకొనే.

''మీ వారి కీ విషయం తెలుసా?''

''జేమ్స్ విషయం తెలీదు! ప్రకాష్ సంగతి తెలుసు. నేనే చెప్పాను. డబ్బివ్వమన్నాను. ఆయన ఇవ్వనన్నాడు. వాడ్ని తనతో మాట్లాడమన్నాడు.''

''అతనితో చెప్పావా ఆ విషయం?''

''చెప్పాను!''

''ప్రకాష్ కలుసుకున్నాడా మీ వార్ని!''

''ఆఁ!'' అంది రజని.

కారు పోతూనే వుంది.

''కపూర్ భార్య షీలాను కూడా బెదరించాడా ప్రకాష్?''

''బెదరించాడు. కానీ ఆమె గుట్టు చప్పుడు కాకుండా డబ్బిచ్చింది. భర్తకు కూడా తెలియనివ్వలేదు!'' అంది రజని.

"అసలీ పాడు పనులు మీరెందుకు చేశారు?" అడిగాను విసుగ్గా, కారును కాస్త స్లోచేసి.

"ఇలా చెయ్యడంలో పెద్ద థ్రిల్ వుంటుంది. దొంగతనంగా వస్తువు తీసుకొని దాచి షాపు వెలుపలకు వచ్చేదాకా కలిగే భయం, ఆ తర్వాత వెలుపలికొచ్చాక అనుభవించే ఆనందం, అంత సాహసం చేసి సాధించిన వస్తువును చూసుకున్నాక మనస్సుకు కలిగే ఆహ్లాదం వర్ణనాతీతం. మా ఫ్రెండ్ లీనా ప్రోత్సాహం. కాని ఫలితం ఇలా వుంటుందనుకోలేదు" అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"ఆ ప్రకాష్‌ను ఎవరు చంపారో తెలుసా?"

"తెలీదు!"

"పోనీ ఎవరు చంపివుంటారో ఊహించగలవా?"

"అదే నా ఊహాకందని విషయం!"

"ఆఖరి ప్రశ్న అడుగుతున్నాను. నిజం చెప్పు. రాత్రి నువ్వు మా యింట్లో వున్నావ్. వెళ్ళేముందు నా గదిలో బీరువాలో దాచిన రివాల్వరు దొంగిలించుకుపోయావా?" అడిగాను.

"లేదు!" అంది ఖచ్చితంగా.

"పోనీ షీలా చేసి వుంటుందా?"

"తెలీదు! బాగా మత్తులో వున్నాను."

అంతలో మా యిళ్ళున్న రోడ్ వచ్చింది. ఆమెను వాళ్ళ ఇంటిముందు డ్రాప్ చేశాను. కార్ను ముందుకు పోనిచ్చాను. ఇంటికి తాళం వేసుంది. జూలీ ఎటు వెళ్ళిందాని ఆలోచించసాగాను. కాసేపు తోటలో చెట్లమధ్య తచ్చాడాను.

9

నా మెదడు పదునెక్కింది. రజని చెప్పిన సమాచారం ఆధారంగా ఆలోచనలు రేగుతున్నాయి.

వీళ్ళ స్నేహితురాలు లీనా అందర్నీ దొంగతనాలకు ఎందుకు ప్రోత్సహించింది?అందులో ఆమె స్వార్థమేమైనా వుందా? ఊహించాను. ఆ ప్రకాష్‌కూ, లీనాకు సంబంధముండి వుండాలి! అతనికి కేసులు చూపించేందుకే లీనా ఇలాంటి పథకం తయారుచేసి వుంటుందనుకున్నాను.

ఓమారు లీనాను కలుసుకుంటే...!

అదే సరయిన మార్గమని తోచింది. కారెక్కి రామారావు ఇంటికెళ్ళాను.

బజ్జర్ నొక్కగానే రజని వచ్చింది.

నన్ను చూసి భయంతో కంపించిపోయింది.

"రామారావు లేడుగా?" అడిగాను.

"లేడు!" అందామె.

"లీనా అడ్రసు కావాలి!" అన్నాను.

చెప్పింది రజని.

వెలుపలకొచ్చి కారెక్కాను.

రజని చెప్పిన అడ్రసుకు పోనిచ్చాను. అదో చిన్న పెంకుటిల్లు. తట్టాను తలుపు. వెంటనే తెరుచుకున్నాయి. బజారురకం మనిషిలాంటి స్త్రీ ఎదురుగా నిలుచుంది.

"లీనా నువ్వేనా?" అడిగాను.

"యస్! మీరెవరు?"

"చెప్తాను!" అంటూ లోనికి నడిచాను.

ఇద్దరం కూర్చున్నాం. నా గురించి చెప్పుకొన్నాను.

"ఆ ప్రకాష్ తెలుసా?" అడిగాను.

"తెలుసు! నా ప్రియుడతను."

"అతను తీసిన ఫొటోలు, నెగటివ్ లు ఏమయినాయి?"

"నీకొక్క వాలా?"

"కావాలి?"

"ఎంతిస్తావ్?"

"ఎంత కావాలి?"

"ముందు అడ్వాన్సుగా నాకో బాటిల్ బ్రాందీ కావాలి! అది తాగాక మాట్లాడుదాం?" అంది లీనా.

"బార్ కు పోదామా?" అన్నాను.

"పద!" అంటూ లేచింది.

ఇద్దరం కారెక్కి బార్ కొచ్చాం! రెండు బాటిల్స్ ఖాళీచేసింది లీనా. ఇద్దరం తిరిగి గదికొచ్చాం.

"ఆ ఫొటోల సంగతేమిటి?" అడిగాను.

"ఇస్తాను! ఫ్రీగా యిస్తాను. కానీ నువ్వు నాకో సాయం చెయ్యాలి. వీటికన్నా ఖరీదైన ఫొటోలు నెగటివ్ లున్నాయి. ప్రకాష్ నా కిచ్చాడు. వాటిని ఆంధ్రా బ్యాంక్ సేఫ్టీ లాకర్ లో దాచాను. వాటిని కాస్త అమ్మి పెట్టాలి. దాదాపు రెండు లక్షలన్నా వస్తుంది. ఆ డబ్బు నాకివ్వు. నీ ఫొటోలు ఇచ్చేస్తాను!" అంది లీనా.

"నన్ను, నీ వ్యాపారంలోకి దింపుదామనా?" అడిగాను.

"కాదు! నేను నీకు సాయం చెయ్యవలసిన అవసరం ఉన్నప్పుడు, నువ్వు నాకు సాయంచేసేందుకు వెనుకాడ కూడదు! ఏమంటావ్?" అడిగింది లీనా.

"ఎవరికమ్మాలి?" అడిగాను.

"మీ పత్రిక యజమాని జలాల్ కు. ఆ ఫొటోలు అతనికి సంబంధించినవి" అంది లీనా.

"అందులో వున్న స్త్రీ ఎవరు?"

"నేను చెప్పను. నువ్వే చూడు ఫొటోలు. తెలుస్తుంది!" అంది లీనా.

"అతను నా బాస్! అతనితో ఎలా మాట్లాడగలను?" అడిగాను.

"నువ్వయితే ఎవ్వరూ అనుమానించరు? అందుకే ఈ పనికి సరయిన మనిషివనిపిస్తూంది" అంది లీనా.

వేరే ఆలోచించే అవకాశం కనుపించలేదు.

ఆమె దగ్గర బ్యాంక్ కు ఆథరైజేషన్ లెటర్ తీసుకున్నాను. మరుసటిదినం వస్తానని చెప్పి బయలుదేరాను.

"ఆ డబ్బుతో పారిపోదామని ప్రయత్నించావంటే నీ బ్రతుకు రచ్చకీడ్చే ఫొటోలు నా దగ్గరున్నాయి. మరచిపోకు!" హెచ్చరించింది లీనా.

మాట్లాడకుండా కారెక్కాను.

రామారావు గుర్తొచ్చాడు. కారును పార్క్ కేసి పోనిచ్చాను.

"ఎందుకు కలుసుకోవాలని పిలిచారు?" అడిగాను ఎదురుగా కూర్చుంటూ.

"ఆ ప్రకాష్ను హత్యచేశావ్! చాలా సంతోషం, మరి మా ఫొటోలు ఇచ్చెయ్యి. నీకో కానుక ఇస్తాను!" అన్నాడు రామారావు.

"ఏమిటది?" అడిగాను.

"నువ్వు కాల్చిన తూటా ప్రకాష్ గుండెల్లోంచి వెలుపలకొచ్చి పడింది. పోలీసులకన్నా ముందు నేనే దాన్ని పట్టుకొన్నాను. నీ కోసం తెచ్చాను. ఫొటోలు ఇస్తే, దాన్ని నీకిస్తాను. లేకుంటే తిన్నగా పోలీసుల కందజేస్తాను!" అన్నాడు రామారావు.

"దాన్ని తెచ్చావా?" అడిగాను.

"లేదు! నీ దగ్గర ఫోటోలు సిద్ధంగా వుండవని తెలుసుగా. అందుకని తేలేదు!" అన్నాడు.

"దాన్ని నీ దగ్గరే వుంచు! రేపు కలుద్దాం! నేను వాటి కోసమే ప్రయత్నం చేస్తున్నాను. దొరకగానే ఇస్తాను" అంటూ లేచాను. అతనూ లేచాడు. ఇద్దరం కారెక్కాం. రామారావును ఇంటిదగ్గర డ్రాప్ చేశాను. నేను ఇంటికి వెళ్ళి పడుకున్నాను. జూలీ అంతకుముందే మత్తుగా పడి నిద్రపోతూంది.

10

తెల్లారాక, జూలీ నిద్రపోతూండగానే బయలుదేరాను. తిన్నగా జేమ్స్ ఇంటికి వెళ్ళాను.

నే వెళ్ళేసరికి కాఫీ త్రాగుతున్నాడు.

నన్ను చూడగానే నవ్వి" రాత్రి నేనొచ్చేసరికి బాగా లేటయింది. అందుకని మిమ్మల్ని కలుసుకోలేదు!" అన్నాడు.

"నేను చెప్పిన పనేమైనా చేశావా?" అడిగాను.

తను తెలుసుకొంది క్లుప్తంగా చెప్పాడు. లీనా గురించి కూడా చెప్పాడు. అతనివల్ల నాకేం క్రొత్త సమాచారాలు తెలియలేదు.

అక్కడ్నుంచి బ్యాంకుకు వెళ్ళి, సేఫ్టీ లాకర్ లోంచి కవరు తీసుకొన్నాను. కవరుతో సహా తిన్నగా ఆఫీసు చేరుకున్నాను.

విజిటర్స్ రూంలోనే ప్రత్యక్షమైనాడు సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఈశ్వరరావు. అతన్నిచూసి భయం పుట్టింది.

"రండి!" అంటూ గదిలోకి పిలుచుకుపోయాను.

నా వెంట వచ్చాడతను.

"మళ్ళీ ఒక హత్య జరిగింది!" అన్నాడు కూర్చుంటూ ఈశ్వరరావు.

"ఎవర్ని హత్య చేశారు?"

"లీనా అనే అమ్మాయిని. ఆమె ప్రకాష్ ప్రియురాలు. అతన్ని చంపిన రివాల్వరుతోనే, ఈమెనూ చంపారు. ఆ రివాల్వరు పరిశోధనపైన మీదని తేలింది. అందుకే వచ్చానిక్కడకు" అన్నాడు.

"చిత్రంగా వుందే! నా రివాల్వరు నా యింట్లో బీరువాలో వుండాలి!" అన్నాను.

"ఉందో, లేదో తెలుసుకుంటారా?" అడిగాడు.

వెంటనే యింటికి ఫోన్ చేశాను.

జూలీ లైన్లోకి రాగానే ఈశ్వరరావు చెప్పిన వివరాలు చెప్పి, రివాల్వరుందో లేదో చూడమన్నాను. రెండు నిమిషాల తర్వాత ఆమె లేదని చెప్పింది. ఆ విషయం ఈశ్వరరావుకు చెప్పాను.

"ఎవరికైనా ఇచ్చారేమో గుర్తుంచుకోండి!" అన్నాడు ఈశ్వరరావు అనుమానంగా చూస్తూ.

"లేదు! ఆ మధ్య ఒకమారు సర్వీస్ చేయిద్దామని తెచ్చాను. మళ్ళీ తిరిగి బీరువాలో పెట్టానో లేదో తెలీదు. బహుశా కారు డాష్‌బోర్డులో మరచిపోయి వుంటానేమో?" అన్నాను.

"ఎన్నాళ్ళయింది జరిగి?"

"నాల్రోజుల నాటి మాట."

"ఎక్కడెక్కడో తిరిగుంటారు. కార్ను ఎన్నోచోట్ల పార్కు చేసుంటారు? ఎవరైనా దొంగిలించే అవకాశం వుంది. ఎవర్నని అనుమానించడం? మీరు ఆలోచించండి.

ఎవరిపైనన్నా అనుమానం కలిగితే తెలియపరచండి. మా ప్రయత్నాలు మేమూ చేస్తాం!'' అన్నాడు ఈశ్వరరావు లేస్తూ.

''అలాగే!'' అన్నాను.

''నాదొక చిన్న సలహా! నిజం నిప్పులాంటిది. దాచు కున్న కొద్దీ గుండెల్ని కాల్చివేస్తుందది. అది మంటలా మండి అందరికీ కనుపించేముందే, వెలికి చెప్పి ఆర్పుకోవడం, వివేకం! ఇదీ ఆలోచించండి!'' అని వెళ్ళిపోయాడు.

నాపైన అతనికేదో అనుమానముందనిపించింది.

నేను రివాల్వరును పారెయ్యమని వనజ కిచ్చిన వైనం గుర్తొచ్చింది. ఆమె పారేసుంటే అది ఎవరికో చిక్కి వుండాలి. దాంతో మళ్ళీ లీనాను హత్య చేసివుండాలి!

ఎక్కడో పారేసిన రివాల్వరు, లీనాను చంపవలసిన అవసరం వున్న వ్యక్తికి మాత్రమే దొరకటం కాకతాళీయ మేమో ననుకున్నాను. నా మెదడింకా వేగంగా ఆలో చించసాగింది.

ఇంటర్ కామ్ లో పిలిచాను వనజను. ఆమె లోని కొచ్చింది. కూర్చోమన్నట్లు చేత్తో సంజ్ఞ చేశాను. కూర్చుందామె.

''నిన్న నీకిచ్చిన రివాల్వరు ఏం చేశావ్?'' అడిగాను.

''మీతో చెప్పాగా, కూం నదిలో పారేశాను!'' అంది వనజ.

''ఆ మాట నిజమేనా?'' అడిగాను.

''మీ కెందుకొచ్చిందా అనుమానం!''

''ఆ రివాల్వరుతో ఇవాళో హత్య జరిగిందని తెలి సింది!''

ఆమె మొఖంలో రంగులు మారిపోయాయి. తలుపు

తోసుకొని జేమ్స్ లోనికొచ్చాడు. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి.

"మిస్టర్ రఘూ! నువ్వు నిన్న లీనాను కలుసుకున్నావ్ కదూ!" అడిగాడు.

"నీకెవరు చెప్పారు?"

"అవసరముంది గాబట్టి తెలుసుకున్నాను."

"అయితే ఏమంటావ్?"

"ఆమె నీకు ఫోటోలిచ్చింది కదూ!" అడిగాడు మానంగా. నాకు ఈ గొడవంతా కాస్త కాస్త అర్థమైంది.

"ఇచ్చింది" అన్నాను.

"అవి కావాలి!" అన్నాడు జేమ్స్.

"నా దగ్గర లేవు" అన్నాను.

"మర్యాదగా ఇచ్చెయ్యి. లేకుంటే..." అంటూ జేబులోంచి రివాల్వరు తీశాడు జేమ్స్.

దాన్ని చూడగానే నాకు మతిపోయింది. కారణం ఆ రివాల్వరు నాది కావటం.

"ఇక్కడే వున్నాయి. ఇస్తాను. తీసుకో!" అన్నాను.

అతను రివాల్వరు దించాడు.

నేను బ్రీఫ్ కేస్ తీసి కవరు వెలుపలకు లాగాను. దాని ఫ్లాప్ ఊడదీసి ఫోటోలు చేతికి తీసుకున్నాను.

వాటిలో వనజా, జలాల్ వున్నారు. అన్ని ఫోటోలు దాదాపు ఒకే రకమైన గదిలో తీసివున్నాయి.

నాకు పిచ్చిపట్టేటట్లు వుంది.

అతనా ఫోటోలను లాక్కున్నాడు.

"ఈ ఫోటోలకోసం జలాల్ ఆదేశం పైన నేనూ, వనజా, కొన్ని రోజులనుంచి ప్రయత్నిస్తున్నాం. నిన్ను జైలుకు పంపించడం, ఫోటోలు చేజిక్కించుకోవడం

రెండూ ఒకే దెబ్బకు జరగాలన్నాడు జలాల్. రివాల్వరు దొంగిలించాం, నేను ప్రకాష్ దగ్గరకు వెళ్ళి బెదరించాను. అతను ఫోటోలు ఇవ్వలేదు. కాల్చిపారే శాను. ఆ తర్వాత ఇల్లంతా వెతికాను. ఒక్కటీ కనుపించ లేదు. రివాల్వరు తెచ్చి నీ యింట్లో వేశాను. దాన్ని నువ్వు వనజకిచ్చావ్. లీనా అంతు తేల్చుకోనేందుకు అది మళ్ళీ ఉపయోగిస్తుందని తీసుకుని వెళ్ళాను. భయపెట్టాను. రివా ల్వరు చూపించేసరికి భయపడి మొత్తం నీ కిచ్చినట్లు చెప్పింది. అందుకే వచ్చాను. ఈ రివాల్వరు పోలీసులకు చేరే ఏర్పాట్లు చేసి వుంచాను. దాంతో నువ్వు జైలుకు పోతావ్. కేసు ముగుస్తుంది.'' అన్నాడు జేమ్స్.

నాకు వనజపైనే కాదు, మనుషులందరిపైన అసహ్యాం వేసింది. ఇలాంటి నీచుల మధ్య వుండటంకన్నా, చెయ్యని నేరం సాకుతో, జైల్లో వుండటమే మేలనిపించింది.

అదే నిముషంలో తలుపు తోసుకొని లోనికొచ్చాడు ఈశ్వరరావు, చేతిలో రివాల్వర్‌తో. జేమ్స్, వనజ నివ్వెర పోయారు.

నేను ఏ విషయమూ పట్టించుకోకుండా అలాగే కూర్చు న్నాను. నా మెదడు ఎప్పుడో మొద్దుబారిపోయింది.

మరో నిముషంలో జేమ్స్‌ను చొక్కా పట్టుకుని బైటకు లాక్కుపోతూన్న ఈశ్వరరావుని మాత్రం గమ నించాను.

ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు లెటరు రాసి, సీట్లోంచి, బయటికి కదిలాను.

—: ఐ పో యిం ది :—